## నేటి నుంచి ఫార్మసీ కౌన్సెలింగ్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): బీ ఫార్మసీ, ఫార్మా-డీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి రెండో విడత వెబ్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. సోమవారం ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించగా, మంగళవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపడతారు. ఈ నెల 5, 6న వెబ్ ఆప్షన్లను, 9న సీట్లు కేటాయిస్తారు. వివరాలకు https://tgeapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు.

## పోరాటంతోనే మెస్‌చార్జీల పెంపు: యూటీఎఫ్

హైదరాబాద్, నవంబర్3 (నమస్తే తెలంగాణ): టీఎస్ యూటీఎఫ్, గురుకుల సంఘాల జేఏసీ చేపట్టిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యార్థుల మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచిందని టీఎస్ యూటీఎఫ్ సోషల్ వెల్ఫేర్ గురుకుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ల య్య వెల్లడించారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మెస్‌చార్జీలను పెంచకపోవడంతోనే విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని భావించి, ఉపాధ్యాయుల సామాజిక బాధ్యతగా సెప్టెంబర్ 28న మహాధర్నా నిర్వహించామని తెలిపారు. దీంతో ప్రభుత్వం మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచిందని వివరించారు. గురుకులాల్లోని ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యార్థుల సంక్షేమానికే డైట్ చార్జీల పెంపు: మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమం కోసమే ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివారం ములుగులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద పిల్లలకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం హాస్టళ్లలో కనీస వసతులు కల్పిస్తున్నదని చెప్పారు. ఆమె వెంట కలెక్టర్ దివాకర ఉన్నారు.

## మేడిపండులా రేవంత్‌రెడ్డి పాలన

### ఎంపీ డీకే అరుణ ధ్వజం

హైదరాబాద్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పాలన మేడిపండు చందంగా ఉన్నదని, ప్రజలను గ్యారెంటీల పేరిట నమ్మించి వంచించారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధ్వజమెత్తారు. ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా చేసిన విమర్శలకు ఘాటుగా బదులిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదని, అందుకే హర్యానాలో ప్రజలు నమ్మలేదని విమర్శించారు. రుణమాఫీ, రైతుభరోసా, కౌలు రైతులు, కూలీలకు రూ.12వేలు, యువతకు నిరుద్యోగ భృతి, 2లక్షల ఉద్యోగాలు, ఎలక్ట్రిక్ స్కూటీలు, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, పింఛన్ల పెంపు ఇలా ఇచ్చిన హామీలన్నీ బోగస్ అయ్యాయని నిప్పులు చెరిగారు. హామీల అమలు చేతకాని సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీని విమర్శించే నైతిక హక్కులేదని మండిపడ్డారు.

## లండన్ పర్యటనకు మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం లండన్ పర్యటనకు బయలుదేరనున్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేయడం, పర్యాటకులను ఆకర్షించడం, పర్యాటక రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగుతున్నదని మంత్రి కార్యాలయం ప్రకటనలో తెలిపింది. 5నుంచి 7వరకు లండన్‌లో జరిగే ప్రతిష్టాత్మక వరల్డ్ ట్రావెల్ మార్కెట్(డబ్ల్యూటీఎం)లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, వారసత్వ సంపదను వివరించేలా పర్యాటక శాఖ ఒక స్టాల్‌ను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఆయా దేశాల పర్యాటక శాఖల మంత్రులు, విదేశీ ప్రతినిధులు, గ్లోబల్ టూరిజం బోర్డులు, హోటళ్ల యజమానులు, ప్రయాణ, ఆతిథ్యరంగ నిపుణలతో మంత్రి చర్చలు జరుపనున్నారని వెల్లడించారు. లండన్‌లోని కాసిల్ గ్రీన్ లో నిర్వహించే తెలంగాణ పర్యాటక రోడ్ షోలోనూ పాల్గొంటారని వివరించారు. కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, 100కుపైగా విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

# హామీలపై చేతులెత్తేసిన కాంగ్రెస్

- పది క్యాబినెట్ భేటీలు నిర్వహించినా అమలు నిల్
- సోనియా గాంధీ, రాహుల్ గాంధీ హామీలకూ లేని అతీగతీ
- అయినా పెదవి విప్పని అగ్రనేతలు
- అగ్గిమీద గుగ్గిలం అవుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రజలు
- హామీలు అమలు చేయాల్సిందేనని పట్టు పడుతున్న ప్రజానీకం
- లేదంటే ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తామని ప్రతిన

> తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఆరు గ్యారెంటీలు హామీ ఇస్తున్నాం. అందులో మహాలక్ష్మి పథకం మొదటిది. నేను హామీ ఇస్తున్నాను. ఈ పథకం ద్వారా మహిళకు ప్రతి నెలా రూ. 2500 అందిస్తాం
>
> –2023 సెప్టెంబర్ 17న రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సభలో సోనియాగాంధీ

> కర్ణాటలో ఐదు గ్యారెంటీలు ఇచ్చాం. క్యాబినెట్ తొలి భేటీలోనే ఐదు గ్యారెంటీలు నిలబెట్టుకున్నాం. ఇక్కడ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆరు గ్యారెంటీలను తొలి క్యాబినెట్ భేటీలోనే అమలు చేస్తాం.
>
> – రాహుల్‌గాంధీ

> కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వారిని అమరవీరులుగా గుర్తించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, నెలకు రూ. 25 వేల గౌరవ పెన్షన్ అందిస్తాం. చదువుకునే ఆడపిల్లలకు ఉచిత ఎలక్ట్రికల్ స్కూటీ, రూ. 4000 వేల నిరుద్యోగ భృతి ఇస్తాం.
>
> –2023 మే 8న రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ యూత్ సంఘర్షణ సభలో ప్రియాంకగాంధీ

హైదరాబాద్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): 'మేం అధికారంలోకి వస్తే రాష్ట్ర గతిని మార్చేస్తాం'.. అంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎడాపెడా హామీలు గుప్పించింది. ఆరు గ్యారెంటీలంటూ అరచేతిలో స్వర్గాన్ని చూపెట్టింది. వాటికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ మద్దతు పలికారు. వాటిని అమలు చేసే బాధ్యతను తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. హామీలు అటకెక్కాయి. అప్పుడు హామీ ఇచ్చిన నేతలు ఇప్పుడు సైలెంట్ అయిపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాదికి చేరువవుతున్నా ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. దగ్గరుండి అమలు చేయిస్తామన్న హైకమాండ్ పెద్దలు ఇప్పుడు నోరు విప్పడం లేదు. ఫలితంగా తెలంగాణ ప్రజల పరిస్థితి 'రెంటికీ చెడ్డ రేవడి'లా మారింది.

### పది క్యాబినెట్ భేటీలు ముగిసినా..

2023 సెప్టెంబర్ 17న రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహించిన 'కాంగ్రెస్ విజయ భేరి' బహిరంగ సభకు సోనియా, రాహుల్, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రియాంకగాంధీ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. 'తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడం కోసం ఆరు గ్యారెంటీలు హామీ ఇస్తున్నాం. అందులో మహాలక్ష్మి పథకం మొదటిది. నేను హామీ ఇస్తున్నాను. ఈ పథకం ద్వారా మహిళలకు ప్రతి నెల రూ. 2,500 అందిస్తాం' అని సోనియాగాంధీ హామీ ఇచ్చారు. 'కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు ఇచ్చాం. తొలి క్యాబినెట్ భేటీలోనే వాటిని ఆమోదించి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం. ఇక్కడ కూడా అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ భేటీలోనే వాటిని ఆమోదిస్తాం' అని రాహుల్‌గాంధీ చెప్పుకొచ్చారు. ఇప్పటికే పది క్యాబినెట్ భేటీలు జరిగాయి. ఒకటీ అరా తప్ప ఇచ్చిన హామీలు ఇచ్చినట్టే ఉన్నాయి. ప్రజలు మాత్రం ఇంకా ఆశగా హామీల కోసం కండ్లు కాయాలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

### దుమారం రేపిన ఖర్గే వ్యాఖ్యలు

పార్టీ నేతలతో ఇటీవల సమావేశమైన కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జునఖర్గే చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆచరణ సాధ్యమయ్యే హామీలనే ఇవ్వాలని, హామీలు ఇచ్చే ముందు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రణాళిక లేకుండా ముందు కెళ్తే ఆర్థిక ఇబ్బందులు వస్తాయని, రాష్ట్రం దివాలా తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం సృష్టించాయి. ఖర్గే వ్యాఖ్యలపై కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ప్రజలు మండిపడ్డారు. హామీలు గుప్పించినప్పుడు ఈ విషయం తెలియదా? అని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రజలైతే అగ్గిమీద గుగ్గిలమే అవుతున్నారు. ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయం తెలిసిందా? అని మండిపడుతున్నారు. రాహుల్‌గాంధీ ఆరు గ్యాంరెటీల కార్డు చూపించిననాడు, సోనియాగాంధీ మహాలక్ష్మి పథకాన్ని ప్రకటించిననాడు అదే వేదిక మీద ఉన్న ఖర్గే అది తప్పు అని ఎందుకు చెప్పలేదని నిలదీస్తున్నారు. రాష్ట్ర బడ్జెట్‌కు మించి హామీలు ఉన్నప్పుడు అవి అమలు చేయాలంటే ఖజానా సరిపోదని తెలిసినప్పుడు వాటిని ఎలా ప్రకటించారని ప్రశ్నిస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు బడ్జెట్ లేనప్పుడు, మూసీ ప్రక్షాళన కోసం లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అగ్రనేతలు పెదవి విప్పడం లేదెందుకు?

తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోయినా, అడ్డగోలు హామీలు ఇవ్వడం తప్పని ఖర్గే బహిరంగంగానే చెప్పినా రాహుల్, సోనియా, ప్రియాంకగాంధీ ఎందుకు పెదవి విప్పడం లేదన్న ప్రశ్న అందరినీ వేధిస్తున్నది. కాంగ్రెస్ ఇప్పటికైనా తప్పు తెలుసుకోవడం మంచికే అయిందని అంటున్నారు. కేసీఆర్ తమకు అన్నీ చేసిండని, కాంగ్రెస్ ఇంకేదో చేస్తుందని ఆశపడి అసలుకే మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ప్రతినెల రూ. 2,500 ఇస్తామని స్వయంగా సోనియా చెప్పడం, రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ ప్రకటించడంతో నమ్మి ఓట్లేశామని, కానీ అధికారంలోకి వచ్చాక ఇంత మోసం చేస్తారని అనుకోలేదని దుమ్మెత్తి పోస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసి తీరాల్సిందేనని, లేదంటే ఇకపై జరిగే ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు.

### సార్..సివిల్ కాంట్రాక్టు ప్లీజ్

అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ఇప్పుడున్న 23% నుంచి 42%కి పెంచుతాం. ప్రభుత్వ సివిల్ కన్‌స్ట్రక్షన్, మెయింటెనెన్స్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని 10 నవంబర్ 2023న, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బీసీ డిక్లరేషన్ కూడా ఓ కారణం. బీసీ సంక్షేమం కోసం అదే వేదిక నుంచి 65 హామీలు ఇచ్చారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలైంది. ఏ ఒక్క బీసీకి సివిల్ కాంట్రాక్ట్ దక్కలేదు. వార్షిక ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాలకు చెందిన బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్వయం ఉపాధి, ఉన్నత విద్య కోసం రూ.10 లక్షల వడ్డీ రహిత రుణాలని చెప్పారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సబ్‌ప్లాన్‌కు హామీ ఇచ్చారు. రూ.50 కోట్లతో అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్య భవన్‌లు నిర్మిస్తామని, వాటిలోనే జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేస్తామని డిక్లరేషన్‌లో చెప్పారు. ఇప్పటి వరకు అవి అమలుకు నోచుకోలేదు.

### సోనియమ్మ రాజ్యంలో రుణమాఫీ ఏది?

సోనియమ్మ రాజ్యం అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల రుణమాఫీ చేస్తాం. ఇందిరమ్మ రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఎకరాకు 13వేల పెట్టుబడి సాయం చేస్తామని 7 మే 2022న వరంగల్ రైతు సంఘర్షణ సభలో రాహుల్‌గాంధీ ప్రకటించారు. రైతు డిక్లరేషన్ పేరుతో 31 రైతు సంక్షేమ హామీలు ప్రకటించారు. సోనియమ్మ రాజ్యం అధికారంలోకి వచ్చింది. కానీ రుణమాఫీ కాలేదు, ఇందిరమ్మ రైతుభరోసా ఊసేలేదు. రుణమాఫీ కోసం ఇంకా 22 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారు. మాఫీ కోసం ఇంకో 10 వేల కోట్లు అవసరం. కానీ రుణమాఫీ పూర్తి చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. రబీ సీజన్ వచ్చినా.. ఇప్పటి వరకు రైతు భరోసా జాడ లేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పలేకపోతున్నది. పాల ఉత్పత్తి దారులకు లీటర్ మీద రూ. 5 ప్రోత్సాహకం ఇస్తామని ప్రకటించారు. అతి చిన్న హామీ అయినా.. దీనిని కూడా రేవంత్ ప్రభుత్వం అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నది. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను ఎత్తివేసామని, జూన్ 2న ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు అందజేస్తామని ప్రియాంక హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటి వరకు అమలు కాలేదు.

## అంతెత్తు గాంధీ విగ్రహం ఎందుకు?

- విగ్రహాల ఏర్పాటుకు వ్యతిరేకం
- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- ఆ డబ్బును విద్య, వైద్యానికి ఖర్చు చేయాలని సూచన
- గాంధీ మునిమనువడు తుషార్‌గాంధీ ఎక్స్‌లో పోస్ట్
- డైలమాలో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు

తుషార్‌గాంధీ

హైదరాబాద్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మూసీ నది ఒడ్డున బాపూఘాట్‌లో ఎత్తయిన గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గాంధీ మునిమనువడు తుషార్ గాంధీ వ్యతిరేకించారు. విగ్రహాల ఏర్పాటు పోటీకి తాను వ్యతిరేకమని, దయచేసి ప్రజాధనాన్ని వృథా చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. గాంధీ విగ్రహ ఏర్పాటు కోసం చేసే ఖర్చును విద్య, వైద్యాన్ని మెరుగుపరిచేందుకు వినియోగించాలంటూ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా, ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే విగ్రహం డిజైన్, ఎత్తుపై నిపుణులు, డిజైనర్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నది. ఈ నేపథ్యంలో తుషార్‌గాంధీ ఇలా స్పందించడంతో కాంగ్రెస్ నేతలు డైలమాలో పడ్డారు.

## గాంధీజీ విగ్రహం నోట్లో పటాకులు

- రీల్స్ కోసం మైనర్ బాలుర పైశాచికత్వం
- నలుగురిని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

కంటోన్మెంట్‌లో గాంధీజీ విగ్రహం నోట్లో పటాకులు పెట్టిన దృశ్యం

కంటోన్మెంట్, నవంబర్ 3: భావి భారత పౌరులు సోషల్ మీడియాకు బానిసలుగా మారిపోతున్నారు. రీల్స్ చేయాలనే తాపత్రయంలో విచక్షణ కోల్పోయి ఆకతాయి పనులు చేస్తున్నారు. అలా కొందరు మైనర్ బాలురు ఏకంగా జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహం నోటిలో పటాకులు పెట్టి పేల్చారు. ఆపై ఆ పైశాచిక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఘటన సికింద్రాబాద్ కంటెన్మెంట్‌లో జరిగింది. ఆ ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొందరు ఆ వీడియోను హైదరాబాద్ సీపీకి ట్యాగ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. స్నాప్ చాట్‌లో వచ్చిన వీడియోల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నలుగురు మైనర్ బాలురను నిందితులుగా గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి వెల్లడించారు.

### ముంబైలో మరో ఘటన

ఇటీవల ముంబైలో సైతం ఇలాంటి ఘటన జరిగింది. ఓ యువకుడు కుక్క తోకకు పటాకులు కట్టి నిప్పంటించాడు. అవి పేలడంతో ఆ కుక్క గాయపడింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు భగ్గుమంటున్నారు. నోరులేని మూగ జంతువు పట్ల కర్కశంగా ప్రవర్తించిన ఆ యువకుడిని పట్టుకుని, కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరుతున్నారు.

# బీసీలకు మొండిచెయ్యేనా?

- గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ పెంపు హుళక్కే!
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనతో తేటతెల్లం
- కులగణనకు ముందే ఎన్నికలకు వెళ్లే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- భగ్గుమంటున్న బీసీ సంఘాలు.. పోరుకు సిద్ధమని ప్రకటన

## రిజర్వేషన్లను ఎగ్గొట్టే కుట్ర

డిసెంబర్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే పాత పంచాయతీరాజ్ చట్టం ప్రకారమే ముందుకెళ్లాల్సి ఉంటుందని రాజ్యాంగ నిపుణులు చెప్తున్నారు. ఈ లెక్క ప్రకారం గత ప్రభుత్వం రిజర్వేషన్లకు నిర్దేశించిన పదేండ్ల గడువును యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. పాత పద్ధతిలోనే బీసీలకు 24 శాతం రిజర్వేషన్లను అమలు చేసి 42 శాతం కోటా హామీని ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ ఓటరు జాబితాను సిద్ధం చేసింది. జిల్లాల వారీగా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. కులగణన పూర్తికాకుండానే, బీసీలకు 42 శాతం కోటా లేకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నదని మరిన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి.

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): 'అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో స్థానిక సంస్థల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్ల పెంచుతాం' ఇదీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ. ఇప్పటిదాకా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు సైతం బీసీలకు నిర్దేశిత కోటా నిర్ణయించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ఘంటాపథంగా చెప్పారు. అందుకే కులగణన చేపట్టామని సెలవిచ్చారు. కానీ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తాజా ప్రకటనతో అయోమయం నెలకొన్నది. డిసెంబర్‌లోనే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్న మంత్రి ప్రకటనతో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం మూలనపడినట్టేననే తేటతెల్లం అవుతున్నది. సంక్రాంతిలోగానే గ్రామాల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరుతాయని కూడా మంత్రి ప్రకటించారు. దీన్నిబట్టి కులగణనకు సంబంధం లేకుండానే ఎన్నికలు నిర్వహించేందుకు సర్కారు సన్నాహాలు చేస్తున్నదనే అనుమానాలు నెలకొన్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారమే, పూర్వపు పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచానా వేస్తున్నారు.

### కులగణన లేకుండానే ఎన్నికలు!

ఈ నెల 6 నుంచి కులగణన సర్వే ప్రారంభమవుతుంది. సర్వే ఆధారంగా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించాల్సి ఉంటుంది. ప్రభుత్వం చెప్పిన గడువును పరిగణనలోకి తీసుకున్నా జనవరి వరకు ఈ ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈలోగానే ఎన్నికల నిర్వహణ ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ కులగణన పూర్తయినా రిజర్వేషన్ల ఖరారుకు పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాల్సి ఉంటుంది. ఇందుకు కనీసం నెలరోజులైనా పట్టవచ్చు. డిసెంబర్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే కులగనను పరిగణనలోకి తీసుకోకుండానే ప్రభుత్వం ముందుకెళ్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆందోళనబాటలో బీసీ సంఘాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుంటే పోరాటం తప్పదని బీసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమబాట పట్టారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసేదాకా పంచాయతీ ఎన్నికలు నిర్వహించవద్దని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. సర్కారు పెడచెవిన పెడితే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు.

దామరచర్ల వద్ద పవర్‌ప్లాంట్‌కు వెళ్లే బొగ్గు రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

## త్వరలో నూతన ఇంధన పాలసీ

- మేలో 'యాదాద్రి'లో విద్యుదుత్పత్తి
- 4వేల మెగావాట్లు ఉత్పత్తి చేస్తాం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

దామరచర్ల, నవంబర్ 3: త్వరలోనే నూతన ఎనర్జీ పాలసీ ప్రవేశపెట్టి విద్యుత్ రంగంలో దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో ఆదివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి యూనిట్-2 సింక్రనైజేషన్‌ను ప్రారంభించారు. అంతకుముందు మండల కేంద్రం వద్ద పవర్‌ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గును తరలించే రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్యుత్తు రంగ నిష్ణాతులు, మేధావులు, ప్రజల అభిప్రాయంతో అసెంబ్లీలో చర్చించి నూతన ఎనర్జీ పాలసీని ప్రకటిస్తామని వెల్లడించారు. మే 2025 నాటికి యాదాద్రి పవర్ స్టేషన్ ద్వారా 4వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పవర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు ఉత్పాదనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా ఉంచుతామని స్పష్టంచేశారు.

### టౌన్‌షిప్ నిర్మాణానికి టెండర్లు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): వైటీపీఎస్ ప్లాంట్‌లో వసతుల కల్పనపై టీజీ జెన్‌కో దృష్టిసారించింది. అధికారులు, సిబ్బంది కోసం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మించనున్నది. రూ.929 కోట్లతో నిర్మించేందుకు జెన్‌కో ఇటీవలే టెండర్లు ఆహ్వానించింది. ఇందులో నాలుగు రకాల క్వార్టర్లు నిర్మిస్తారు. ఏ-టైప్-2, బీ-టైప్-6 క్వార్టర్లను నిర్మిస్తారు. ఇవేకాకుండా పాఠశాల, హాస్పిటల్, క్లబ్‌హౌజ్, కమర్షియల్ కాంప్లెక్స్, ఫంక్షన్‌హాల్, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు.

## గొంతులో గుడ్డు ఇరుక్కొని వృద్ధుడి మృతి

అచ్చంపేట (లింగాల), నవంబర్ 3: గొంతులో ఉడకబెట్టిన గుడ్డు ఇరుక్కొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్‌కు చెందిన తిరుపతయ్య (65)